


నాడు - నేడు పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించను

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

భీమవరం : నాడు - నేడు పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నాడు - నేడు పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. నిధులు, వనరులు ఉన్నప్పటికీ నాడు - నేడు పనులు ముందుకు సాగకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు - నేడు పనులు పూర్తయ్యే వరకూ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. సుమారు 40 రోజుల్లో చేయాల్సిన పనులను పది రోజుల్లో ముగిస్తే నాణ్యత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. నాణ్యతలోపిస్తే చర్యలకు ఎట్టి పరిస్థితుల్లో వెనకాడేది లేదన్నారు. ఈ సమావేశంలో డిఇఒ ఆర్.వెంకట రమణ, ఐసిడిఎస్‌పిడి బి.సుజాతరాణి, పిఒఎస్ఎస్ వై.శ్యాంసుందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎఎస్‌ఎ.రామస్వామి, ఆర్అండ్‌బి ఇఇ లోకేశ్వర్, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ విజయ్ పాల్గొన్నారు.

సుర్రుమంటున్న.. సూరీడు..



వేడి గాల్పులకు జనం విలవిల

పది దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యం

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

ప్రజాశక్తి - ఆచంట

భానుడు భగభగ మండిపోతున్నాడు. ముఖ్యంగా రెండు రోజులుగా వేడిగాల్పులకు జనం విలవిల్లాడిపోతున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. మధ్యాహ్నం అయ్యే సరికి భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. దీంతో నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే రహదారులు ఉదయం 11 గంటల నుంచి నిర్మానుష్యంగా మారుతున్నాయి. వారం రోజుల నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఎండతో పాటు, వేడి గాల్పులు వీయడం, ఉక్కబోతగా ఉండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

వృద్ధులు, చిన్నారుల అవస్థలు..

ప్రజలు ఎండ వేడిమిని తట్టుకోలేక విలవిల్లాడిపోతున్నారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఉదయం సాయంత్ర వేళల్లో మాత్రమే ప్రయాణాలు చేస్తున్నారు. దాదాపుగా మధ్యాహ్నం వేళ ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. అత్యవసరమైతే ముఖానికి గుడ్డ కట్టుకుని గొడుగులు చేత పట్టుకుని ప్రయాణిస్తున్నారు. నిత్యం జనంతో రద్దీగా ఉండే తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలు, ప్రయాణికులతో రద్దీగా ఉండే రహదారులు, ప్రధాన కూడళ్లు మధ్యాహ్నం 12 గంటల నుంచి నిర్మానుష్యంగా మారుతున్నాయి. వ్యాపారులు సైతం మధ్యాహ్నం దుకాణాలు మూసివేసి తిరిగి సాయంత్రం తెరుస్తున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో పౌల్ట్రీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గుడ్డు ధర తగ్గి నష్టాలఊబిలో కూరుకుపోయిన యజమానులు పెరుగుతున్న ఎండతో మరింత బెంబేలెత్తిపోతున్నారు. వేసవితాపం క్రమేపీ పెరుగుతుండడంతో శీతల పానీయాలు అలాగే కొబ్బరిబొండాలకు డిమాండ్ బాగా పెరిగింది. కృత్రిమ పానీయాలకంటే ప్రకృతి సిద్ధంగా లభించే కొబ్బరినీరు, తాటి ముంజులు, పుచ్చకాయలు తినేందుకు ప్రజలు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో శీతల పానీయాల ధరలకు రెక్కలొచ్చాయి. అయితే ఎండ, వేడి గాల్పులు తీవ్రంగా ఉండడంతో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పాలకొల్లు : పట్టణంలో రోహిణీ కార్తె ప్రభావంతో శుక్రవారం ఎండ నిప్పుల కొలిమి వలే ఉంది. దీంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. బస్టాండ్లో ప్రయాణికులే కరువయ్యారు. దీంతో బస్సుల రాకపోకలు నామమాత్రపు ప్రయాణికులతో వెళ్తున్నాయి. పట్టణంలోని రోడ్లపై జనసంచారం లేకపోవడంతో వ్యాపారులు కూడా షాపులు కట్టేసి ఇంటి వద్ద ఉంటున్నారు. చిరు వ్యాపారులు సైతం తీవ్ర ఎండ ప్రభావంతో ఇంటి వద్దే ఉంటున్నారంటే ఎండ తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



ఆచంటలో మూతపడ్డ దుకాణాలు


ఎండ ప్రభావంతో నిర్మానుష్యంగా పాలకొల్లు బస్టాండ్

ముదినేపల్లి: రోహిణికార్తె ఠారెత్తిస్తోంది. అధిక ఉష్ణోగ్రతలకు జనం మాడు పగులుతోంది. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు వడగాల్పులు తోడై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. శుక్రవారం ముదినేపల్లి మండలంలో 43 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జనం ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడిపోయారు. మధ్యాహ్నం వేళల్లో మండలంలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రధాన రహదారులపై జన సంచారం, వాహనాల రద్దీ అంతంతమాత్రంగానే కన్పిస్తోంది. బస్సుల్లో ప్రయాణికులు లేక ఖాళీగా దర్శనమిచ్చాయి. స్థానిక బస్‌స్టేషన్ ప్రయాణికులు లేక వెలవెలబోయింది. గత నెలరోజులుగా శీతలపానీయాలకు గిరాకీ పెరిగింది. వేసవి తాపానికి పిల్లలు, వృద్ధులతోపాటు పక్షులు, మూగజీవాలు అల్లాడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఆక్వా రంగంపై చూపుతోంది. చేపలు, రొయ్యల చెరువుల్లో నీరు ఎండలకు బాగా వేడెక్కి ఆక్సిజన్ సమస్యతో కొన్ని రకాల చేపలు, రొయ్యలు ఉక్కిరిబిక్కిరవుతూ మృత్యువాత పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. వడగాల్పులకు మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిన్నటి వరకు మే నెల ఉష్ణోగ్రతలతో సతమతమైన జనం నేడు రోహిణి కార్తె ప్రభావానికి భీతిల్లుతున్నారు. దీంతో మండలం నిప్పుల కొలిమిగా మారడంతో ప్రాణాలను కాపాడుకునేందుకు జనం నానాతంటాలు పడుతున్నారు. గాలిలో తేమశాతం తగ్గడంతో ఉదయం ఏడు గంటల నుంచే విపరీతంగా ఉక్కపోత మొదలవుతోంది. దీనికితోడు గ్రామాల్లో అనధికార విద్యుత్ కోతలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తరచూ ఏర్పడటంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఉక్కపోతలకు ఒళ్లు మంట, శరీరంపై చిన్నచిన్న పొక్కులు, దురద వస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉక్కపోత బాగా పెరిగితే ప్రజలకు ప్రాణహాని కలిగే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎండల ప్రభావంతో రేకుల షెడ్లలో నివశించే జనం నరకం అనుభవిస్తున్నారు. ఇళ్లల్లో ఫ్యాన్లు తిరుగుతున్నా చెమటలు తగ్గడం లేదు. ఎండలకు పక్షులు, మూగజీవాలు అల్లాడుతున్నాయి. రైతులు పశువులను ఊర చెరువుల్లో దింపి ఎండల నుంచి కాపాడుకుంటున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు ఫారాల్లో ఉన్న కోళ్లు ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయి. దీంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూలర్లు, ఎసిలు వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం కూడా బాగా పెరిగింది. ఉష్ణోగ్రతలకు ఇళ్లలోని అన్ని గృహోపకరణాలు వేడెక్కిపోతున్నాయి. గత నెల 25న మొదలైన రోహిణి కార్తె ఈ నెల ఆరో తేదీ వరకు ఉండడంతో జనం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.


మృతి చెందిన కోళ్లు


రీసర్వే ఆన్‌లైన్ ప్రక్రియ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి

రీసర్వే పనులను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి

ప్రజాశక్తి - కాళ్ల

రెండోదశ రీసర్వే పనులు వేగవంతం చేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. పెదఅమిరం గ్రామ సచివాలయం, జక్కరం కోపల్లె, పెదఅమిరం గ్రామాల్లో రీ సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ పనులను కలెక్టరు ప్రశాంతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రీ సర్వే పనులు బాగా జరుగుతున్నాయని, సంబంధిత సిబ్బందందరూ కలిసికట్టుగా త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. మొదటి దశలో రీ సర్వే జిల్లాలోని వివిధ మండలాల్లోని 16 గ్రామాల్లో విజయవంతంగా పూర్తి చేసుకున్నామన్నారు. అదే స్ఫూర్తితో రెండో దశ రీ సర్వే పనులు జిల్లాలో మిగిలిన అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలన్నారు. సర్వే జరుగుతున్న సమయంలో ప్రతి రైతునూ, భూ యజమానినీ భూమి వద్దకు పిలిచి సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే ఆఫ్ ఇండియా వారి నుంచి 45 గ్రామాల భూమికి సంబంధించి మ్యాప్‌లు వచ్చాయని, మిగిలిన మ్యాప్‌లు కూడా త్వరలో రానున్నాయన్నారు. రీ సర్వే పనులు ప్రారంభం నాటి నుండి పూర్తయ్యేవరకూ ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. రీ సర్వేపై అధికారికి, సిబ్బందికి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, ఎంపిడిఒ జి.స్వాతి, మండల సర్వేయరు, గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు పాల్గొన్నారు.


గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలన్

పరిహారం ఇస్తారా.. సాగు చేసుకోమంటారా

వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి జెక్కంశెట్టి సత్యనారాయణ

24వ రోజుకు చేరిన పాలకోడేరు పేద రైతుల నిరసన దీక్ష

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు జగనన్న ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన నిరుపేద రైతులకు పరిహారం ఇస్తారా.. లేక ప్రభుత్వం తీసుకున్న భూముల్లోనే సాగు చేయమంటారా అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. పాలకోడేరు కోటిగట్టు నిరుపేద రైతులు చేపట్టిన నిరసన దీక్ష స్థానిక పాత పంచాయతీ భవనం వద్ద 27వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, సత్యనారాయణ మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అమరుల స్ఫూర్తితో నిరుపేద రైతులకు పరిహారం అందించే వరకూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి నిరుపేద రైతులను మోసగించడం అన్యాయమన్నారు. ఇచ్చిన భూములకు పరిహారం ఇవ్వాలని రోజుల తరబడి నిరసన తెలియజేస్తున్నా పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలన్ మాట్లాడుతూ తమకు అన్యాయం జరిగిందని ఎన్నో రోజుల నుంచి మండుటెండలో కుటుంబ సభ్యులంతా చిన్నపిల్లలతో నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అసైన్డ్ భూమి అని పరిహారం రాదని చెప్పడం ఎంతవరకూ సమంజసమని తెలిపారు. అసైన్డ్ భూమి అయినప్పుడు ప్రభుత్వాధికారులు ఇళ్ల స్థలాలకు భూమిని ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే సిపిఎంతోపాటు జనసేన, టిడిపి, రైతు, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, కల్లుగీత కార్మిక సంఘం, రజకుల సంఘాలు బాధితులకు అండగా నిలబడి వారు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం తెలిపాయన్నారు. ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన మాట ప్రకారం వారికి పరిహారం అందించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు శేషాపు ఆశ్రియ్య, గ్రామస్తులు మూర్తి నందన, కిరణ్ బాధితులు సాయిబాబా, సత్యనారాయణ, రామలక్ష్మి పాల్గొన్నారు.

కౌమర బాలికలకు రక్షణ చర్యలు చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం


బ్రోచర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

బాలలు, కౌమార బాలికలను గుర్తించి ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాలల రక్షణకు సంబంధిత శాఖలు కార్యాచరణ రూపొందించి తనిఖీలు నిర్వహించాలన్నారు. బాలలు, కౌమార కార్మికుల రక్షణ, పునరావాసంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. 14 ఏళ్లలోపు చిన్నారులతో ఎవరైనా, ఎక్కడైనా పనిచేయిస్తే చట్టపకారం శిక్షార్హులన్నారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి వారు ఏదైనా పనిలో ఉన్నారా, ఇంటి వద్ద ఉన్నారా ఆరా తీయడంతో పాటు వారిని తిరిగి చదువుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో ఆరు టీమ్‌లతో నేటి నుండి జూన్ నెలాఖరు వరకూ బాల కార్మికుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. బాల కార్మికులచే పనులు చేయిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల కార్మికుల దుస్థితి నుంచి బయటకు తీసుకొచ్చి వారికి మంచి భవిష్యత్ అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. విద్య, పోలీస్, కార్మిక శాఖ, బాలల హక్కుల పరిరక్షణ సంస్థలు, సోషల్ వెల్ఫేర్ శాఖలు వైద్యశాఖ అధికారులతో బాల కార్మికులను గుర్తించి వారిని పనుల్లో నుంచి పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. భిక్షాటన చేసే బాలలను రైల్వే స్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్‌లోను అలాగే హోటళ్లు, కిరాణాషాపులు, ఇటుక బట్టీలు, ప్యాకింగ్ ఇండస్ట్రీస్, ఆక్వా ఫీల్డ్, బేకరీ ఇండస్ట్రీస్, తదితర ప్రదేశాలలో పనిచేసే వారిని గుర్తించాలని తెలిపారు. జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులుగా పనిచేస్తున్నట్లు గుర్తిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో బాల కార్మికుల నిర్మూలనకు కలిసికట్టుగా పని చేయాలన్నారు. అనంతరం బాలకార్మికుల నిర్మూలనపై అవగాహన గోడ ప్రతిని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, అడిషనల్ ఎస్‌పి ఎటివి రవికుమార్, ఆర్‌డిఒ దాసి రాజు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, సిడబ్ల్యూసి ఛైర్‌పర్సన్ రబికా రాణి పాల్గొన్నారు.

ఉపాధి హామీ జోలికొస్తే ఊరుకోం : వ్యకాస

ప్రజాశక్తి - తణుకు రూరల్


కూలీల కడుపు నింపుతున్న ఉపాధి హామీ జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రాంతాన్ని సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పని అయిన తర్వాత రెండో ఫొటో కోసం ఎక్కువ సమయం పని ప్రదేశంలో గడపాల్సి వస్తోందని, ఎండ తీవ్రత కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కూలీలు వీరభద్రరావు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల మోడీ పాలనలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో ఉపాధి హామీ పనులకు కోత పెడుతూ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని శతవిధాలుగా కుట్ర చేయడమే దీనికి నిదర్శనమని తెలిపారు. ఏటా బడ్జెట్లో క్రమంగా ఉపాధి హామీ పనులకు నిధులు తగ్గించి కార్మికులే పనికి రావడం లేదని చెబుతూ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే పనిచేయకుండానే కూలీలు డబ్బులు తీసుకుంటున్నారని, సోమరి పోతులు అవుతున్నారని పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి దుర్మార్గమైన వాదనలన్నీ వ్యవసాయ కూలీలను అవమానించడానికేనని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయించాలని, పని ప్రదేశంలో చనిపోయిన కూలీలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. బండారు వెంకటేశ్వరరావు, కామన నాగులు, వంకా దుర్గ, ఇళ్ల వరలక్ష్మి, కాగిత వీరాంజనేయులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న చిన వీరభద్రరావు

పాలకోడేరు ఇఒపిఆర్‌డికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు ఇఒపిఆర్‌డి వి.రెడ్డియ్య ఇటీవల ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొంది కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు. కృష్ణా జిల్లాలోని ఏదో ఒక మండలంలో ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించాల్సి ఉందని ఆయన తెలిపారు. గతంలో వీరవాసరం, పాలకోడేరు, భీమవరం మండలాల్లో ఆయన పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి ఇఒపిఆర్‌డిగా ఉద్యోగోన్నతి పొందారు.


ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న డిసిహెచ్ఎస్ వీరాస్వామి

ఆసుపత్రిలో డిసిహెచ్ఎస్ తనిఖీ

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిని శుక్రవారం డిసిహెచ్ఎస్ డాక్టర్ వీరాస్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత ఆసుపత్రిలోని ఒపి విభాగాన్ని పరిశీలించి, వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆసుపత్రిలో కొన్ని ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఒక నివేదిక రూపొందించమని వచ్చిన ఆదేశాల మేరకు ఆసుపత్రిని పరిశీలించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో విచారణ పెట్టామని, వైద్యులతో మాట్లాడి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ వెలగల అరుణ, నర్సింగ్ సూపరింటెండెంట్ జాన్‌లిల్లి, ఎఆర్‌టి సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ స్థాయి కమిటీ సమావేశాలు ఈ నెల మూడో తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 నిముషాల వరకు స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు తప్పనిసరిగా జిల్లా ప్రజా పరిషత్ స్థాయి కమిటీ సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

సంచార వ్యాన్ ద్వారా మజ్జిగ

ప్రజాశక్తి - ఉంగుటూరు

వేసవి కాలంలో వడగాల్పుల బారిన పడకుండా ఉపశమనం కలిగించేందుకు ఉపాధి కూలీలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మొబైల్ వ్యాన్ ద్వారా మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించామని శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఛైర్మన్, జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. 17వ రోజు శుక్రవారం ధర్మరాజు చేతుల మీదుగా ఉంగుటూరులో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. నాచుగుంట, బాదంపూడి, ఉప్పాకపాడు గ్రామాల్లో పాదచారులకు, ప్రయాణికులకు మజ్జిగ అందించారు. గత నెల 17వ తేదీన మొబైల్ వ్యాన్ ద్వారా మజ్జిగ పంపిణీ కార్యక్రమన్ని ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు నాలుగు మండలాల ప్రజలకు నిరంతరాయంగా మొబైల్ వ్యాన్ ద్వారా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీలో నాణ్యమైన ఆహారం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నెల రోజుల్లో కొత్త టెండర్ పిలవడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్‌జియు కెటి ఛాన్సలర్ ఆచార్య కేసి రెడ్డి తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటి కళాశాలలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ టెండర్ పిలిచిన మూడు నెలల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేని మెనూ అం దించేలా ప్రణాళిక బద్ధంగా ఆహారంలో లోపాలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రధానోపాధ్యాయులు సస్పెన్షన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక జెడ్‌పి హెచ్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు జడ జగ్గారావును సస్పెన్షన్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం డివైఇఒ రామన్న దొర ప్రధానోపాధ్యాయులు గేడ జగ్గారావుకు సస్పెన్షన్ ఉత్తర్వులు అందించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులను పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించిన ఘటనపై బాలల హక్కుల కమిషన్, విద్యాశాఖాధికారులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇటీవల జెడ్‌పి హెచ్ బాలుర పాఠశాల స్కూల్ అసిస్టెంట్లు సుధాకర్ రెడ్డి, విజయప్రకాష్‌లను సస్పెన్షన్ చేశారు. అనంతరం విద్యార్థులను పోలీస్ స్టేషన్‌లో నిర్బందించడంలో బాధ్యతారాహిత్యం కనపరిచినట్లు విచారణలో నిర్ధారించిన ఉన్నతాధికారులు ప్రధానోపాధ్యాయులు జగ్గారావును కూడా సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని డివైఇఒ రామన్న దొర తెలిపారు.

చంద్రబాబువి మోసపూరిత హామీలు
ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మరోసారి మోసపూరిత హామీలిస్తున్న చంద్రబాబు గతంలో ఇచ్చిన 600 హామీలను ఎందుకు అమలు చేయలేదని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ విమర్శించారు. అనాకోడేరు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చంద్రబాబు ప్రజలను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబు రాజకీయాలను భ్రష్టు పట్టించారన్నారు. 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా అమలు చేసి రాజకీయాల్లో విశ్వసనీయతను తిరిగి నెలకొల్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, జెడ్పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తహశీల్దార్ వై.రవికుమార్ పాల్గొన్నారు.


ఎంపిడిఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

గూడెం ఎంపిడిఒగా విశ్వనాథ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.విశ్వనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు జిల్లా పరిషత్‌లో ఎఒగా పనిచేసి ఉద్యోగోన్నతిపై తాడేపల్లిగూడెం వచ్చారు. గతంలో ఎంపిడిఒగా పనిచేసిన జివికె మల్లికార్జునరావు ఉద్యోగన్నతిపై జిల్లా డిపిఒగా వెళ్లగా ఇప్పటి వరకూ పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాల్ ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహించారు. శుక్రవారం డిఇ వేణుగోపాల్ విశ్వనాథ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌కు మండల కార్యదర్శులు ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు నచ్చి పట్టణంలోని 2, 3, 4 వార్డుల్లోకు చెందిన వంద మందికి పైగా యువకులు, మహిళలు పార్టీలో చేరినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాత్రి వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ యువత బంగారు భవిష్యత్ కోసం బాధ్యతగా పనిచేస్తామన్నారు. యువత కుల, మతాలకు అతీతంగా అండగా నిలబడితే జనసేన అధికారంలోకి రావడం ఖాయమన్నారు. భవిష్యత్తులో ఎవరిది నిజమైన పోరాటమో, ప్రజలు ఎవరి వైపు ఉన్నారో తెలుస్తుందని బొలిశెట్టి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వానపల్లిగూడెం యువత, నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి సాయం

ప్రజాశక్తి - యలమంచిలి

కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బాడవ గ్రామానికి బళ్ల రామకృష్ణకు శుక్రవారం ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వైద్య పరంగా అన్ని విధాలా రామకృష్ణకు అండగా ఉంటామని వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపిపి రావూరి వెంకటరమణ బుజ్జీ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇలపకుర్తి లక్ష్మీ పండు, గ్రామ అధ్యక్షులు ఇనుకొండ చిన్న పాల్గొన్నారు.


వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

గ్రామాల్లో చెరువుల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామాల్లో అభివృద్ధి చేసిన చెరువులను శుక్రవారం అధికార బృందం పరిశీలించింది. మొగల్తూరు, మోడీ, పేరుపాలెంనార్త్, వారతిప్ప, రామన్నపాలెంలో అభివృద్ధి చేసిన చెరువులను అధికార బృందం సభ్యులు ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యు.రవిరాజా, వ్యవసాయ శాఖ ఎడి ఇ.అనితాకుమారి, డిఆర్‌పి బి.మహేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులోకి ఇన్‌లెట్ అవుట్లెట్లను, చెరువుగట్లను పరిశీలించారు. చెరువు వినియోగంపై ప్రజలను ఆరా తీశారు. వారి వెంట ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్ కుమార్, ఎపిఒ వై.శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి ఎం.నవీన్‌కిరణ్, సర్పంచులు పేరుపాలెం వెంకన్న, మారెళ్ల మాధవి, పడవల మేరీ సత్యనారాయణ, బందెల ఎలీషా ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

కుమార్తె కనిపించడంలేదని తండ్రి ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉండి

కుమార్తె కనిపించడంలేదని తండ్రి ఉండి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని యండగండి గ్రామానికి చెందిన యువతి (17) భీమవరంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ క్రమంలో గురువారం ఉదయం కళాశాలకు బయలుదేరి వెళ్లిన యువతి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో తండ్రి వేగేశ్న వెంకట్రాజు శుక్రవారం ఉండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


రైలు పట్టాలపై గుర్తు తెలీని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం-బాదంపూడి రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. తాడేపల్లిగూడెం జిఆర్‌పి ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం తాడేపల్లిగూడెం నుంచి బాదంపూడి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది.


గుర్తు తెలియని మృతదేహం

మృతునికి 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని, నలుపు రంగు కట్ బనియన్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారు 9490617090 ఫోన్‌చేయాలని తాడేపల్లిగూడెం రైల్వే ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు.


ఆచంట రామగుండం చెరువు చుట్టూ ఉన్న తురాయి పూలు

మండువేసవిలో.. పూల సోయగం

ప్రజాశక్తి - ఆచంట

ఈ పూల సోయగాన్ని చూసారా.. మండు వేసవిలో మనసును హత్తుకునేలా ఉన్నాయి కదూ.. ఈ చెట్లు ఎరుపు వర్ణంలో పూలు పూస్తూ ప్రకృతి కొత్త సోయగాన్ని తలపిస్తున్నాయి. మండు వేసవిలో సైతం ఆహ్లాదానిస్తున్న ఈ చెట్లు ఆచంట రామేశ్వరస్వామి ఆలయం ఆవరణ వెనుక ఉన్న రామగుండం చెరువు చుట్టూ ఉన్నాయి. ఈ మొక్కలు పలువురిని ఆకర్షిస్తున్నాయి. ఈ తురాయి స్ప్రాజు చెట్లు చల్లని నీడనివ్వడమే కాకుండా ఉదయం సాయంత్రం వేళల్లో అటుగుండా వెళ్లే వారి మదిని దోచుకుంటున్నాయి.

ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా ప్రముఖ వ్యాపారవేత్త మోటుపల్లి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. శుక్రవారం స్థానిక లయన్స్ హాల్లో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు గొంట్ల కృష్ణమూర్తి, 2022-23 క్లబ్ అధ్యక్షులు ఎమ్‌డి అహ్మద్ శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. సీనియర్ లయన్స్ మాజీ జోన్స్ ఛైర్మన్ సన్నిధి రామ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గొంట్లా కృష్ణమూర్తి వ్యవస్థాపక అధ్యక్షులుగా ఏర్పడిన ఈ క్లబ్ వంద మందికిపైగా సభ్యులతో నడుస్తోందన్నారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ అనేక శాశ్వత పథకాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం క్లబ్ నూతన అధ్యక్షులుగా మోటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎస్‌కె. ముక్తం షరీఫ్, కోశాధికారిగా ఎస్‌విజి.అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కె.చంద్రశేఖర్, కె.రాజేశ్వరి ఎంపికయ్యారని తెలిపారు. ఎమ్‌డి అహ్మద్‌తో పాటు పలువురు డైరెక్టర్లు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారని తెలిపారు. ఈ నెల నాలుగో తేదీ ఆదివారం సాయంత్రం స్థానిక లయన్స్ వి కన్వెన్షన్ హాల్లో నూతన పాలకవర్గం పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదర్శ లయన్స్ నూతన కార్యవర్గ సభ్యులు

బాలికలకు కళాశాల చదువు అవసరం

జెడ్‌పిటిసి లక్ష్మీతులసి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - పాలకోడేరు

బాలికల బంగారు భవిష్యత్‌కు కళాశాల చదువు ఎంతో అవసరమని పాలకోడేరు జెడ్‌పిటిసి పెద్దిశెట్టి లక్ష్మీతులసి సుబ్రహ్మణ్యం అన్నారు. పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మహేష్‌బాబు అధ్యక్షత వహించగా జెడ్‌పిటిసి లక్ష్మీతులసి సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ప్రభుత్వం బాలికల విద్యకు పూర్తి భరోసా కల్పించేందుకు మండలానికో బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పి.మహేష్ బాబు మాట్లాడారు. దీనిలో భాగంగా పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లస్ టు పేరుతో జూనియర్ కళాశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రా ం ం బి. ం చ ం జరిగిందన్నారు. విద్యా కమిటీ ఛైర్మన్ మస్తాన్‌రావు, కో ఆప్టెడ్ సభ్యులు ఆళ్ల నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు పి.మహేష్ బాబు మాట్లాడారు. కళాశాలలో బైపిసి, సిఇసి గ్రూపుల్లో బోధన జరుగుతోందన్నారు. ఇప్పటివరకూ పది మంది బాలికలు కళాశాలలో చేరారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ లెక్చరర్ వసంత కుమార్, గ్రామస్తులు లక్ష్మీపతి, విద్యా కమిటీ సభ్యులు కనకారావు, జ్యోతి, కౌసల్య, లెక్చరర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి లక్ష్మీతులసి సుబ్రహ్మణ్యం

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - తణుకు

ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా టిడిపి మహానాడులో రాష్ట్ర ప్రజానీకానికి ప్రకటించిన మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలకు ప్రాధాన్యతిచ్చిన చంద్రబాబు చిత్రపటానికి మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నరేందర్ సెంటర్ వద్ద టిడిపి శ్రేణులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ మేనిఫెస్టో మహిళలకు, యువతకు, రైతులకు, బిసిలకు, పేదలందరికీ ప్రయోజనం సమకూర్చే విధంగా పథకాలు ప్రకటించారన్నారు. దీపం పథకం కింద సంవత్సరానికి ఉచితంగా మూడు గ్యాస్ బండలతో పాటు ఇంట్లో ఎంతమంది పిల్లలు స్కూల్‌కు వెళ్తుంటే అందరికీ 15000 రూపాయలు చొప్పున తల్లికి వందనం కింద ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, పట్టణ కార్యదర్శి రాంబాబు, గోపీశెట్టి రామకృష్ణ, పితాని మోహన్‌రావు పాల్గొన్నారు.

పోడూరు : టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తాని ప్రకటించిన చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం పెనుమదంలో జరిగిన రైతు పోరు కార్యక్రమంలో ధాన్యంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం వస్తేనే చంద్రబాబు పాలనతో రైతు రాజ్యం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు పాతురి రామ్ ప్రసాద్ చౌదరి, పోడూరు, యలమంచిలి, పాలకొల్లు మండలాల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కోడె విజయ భాస్కర్, మామిడిశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

రూ.20.78 కోట్లతో నీటిపారుదల పనులు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి


ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో కాలువల్లో తూడు తొలగింపు, ఇతర పనులకు రూ.20.78 కోట్లు మంజూరయ్యాయని, పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నీటిపారుదల పనులపై అధికారులతో సమీక్షించారు. కాలువలు, డ్రెయిన్లలో తూడు నిర్మూలన పనులను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. యలమంచిలి, నరసాపురం ప్రాంతాల్లో బ్యాక్ వాటర్ కారణంగా సుమారు 3,500 ఎకరాల్లో పంట వేయలేకపోతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, బ్యాక్ వాటర్ ఇబ్బందిని తొలగించేందుకు అవసరమైన పనులకు సంబంధించి ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని తెలిపారు. మాధవాయపాలెం, దర్భరేవు షట్టర్ల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నరసాపురం ప్రధాన కాలువ వెంబడి ఆక్రమణలు, టాయిలెట్ల తొలగింపు పనులను పూర్తి చేసి, ఓఎన్‌జిసి యాజమాన్యానికి బ్యూటిఫికేషన్ పనుల నిమిత్తం అప్పగించాలని సూచించారు. మోగల్లు, పాలకోడేరు శివారు ప్రాంతాల నీటి సమస్య పరిష్కారానికి పూర్తిస్థాయి చర్యలు చేపట్టారు. ఈ సమావేశంలో జిల్లా నీటి వనరుల అధికారి పి.నాగార్జునరావు, కెనాల్స్ ఇఇ దక్షిణామూర్తి, డిఇలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ

ప్రజాశక్తి - గణపవరం

పరిసరాల పరిశుభ్రతతో దోమలను నివారించుకోవచ్చని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్ నాయుడు, పి.కిరణ్మయి అన్నారు. శుక్రవారం మలేరియా దినోత్సవం సందర్భంగా మూడో సచివాలయం వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారానికి ఒకరోజు ఇంటి పరిసర ప్రాంతాలను పొడిగా ఉంచుకోవడం వల్ల దోమలను నివారించగలుగుతామన్నారు. దోమలు పెరగడం వల్ల డెంగీ, మలేరియా వంటి రోగాలు వచ్చే అవకాశాలున్నాయన్నారు. దోమల నివారణకు ఇళ్ల వద్ద పనికిరాని కొబ్బరిబొండాలు, పాత టైర్లలో మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. పూల కుండీల్లో కూడా నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, ఎంఎల్‌హెచ్‌పి నున్న పాప, ఎఎన్ఎం ప్రేమలీల, హెల్త్ అసిస్టెంట్ ఎ.కృష్ణ, ఎం.నల్లయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పిహెచ్‌సి వైద్యులు, ఆశావర్కర్లు

బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించరూ..!

శిథిలావస్థలో మరుగుదొడ్లు
మహిళల ఇబ్బందులు
నెలకొన్న అపారిశుధ్యం

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ బస్టాండ్‌లో మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మహిళలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బస్టాండు నుంచి రాజమండ్రి, భీమవరం, తణుకు, నరసాపురం ప్రయాణం చేస్తుంటారు. కళాశాల విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వస్తూ వెళ్తుంటారు. పెనుగొండ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దర్శనానికి యాత్రికులు మన రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వస్తూ ఉంటారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరడంతో మహిళలు, విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ ఆవరణలో అపారిశుధ్యం నెలకొనడంతో దోమలు సంచారం ఎక్కువైంది. దీంతో దోమ కాటుకు గురై రోగాల బారిన పడతామని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

విజయవంతంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 15వ వార్డ్ కౌన్సిలర్ బొమ్మిడి సూర్యకుమారి, బొమ్మిడి కృష్ణమూర్తి పాల్గొని పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకుంటున్న విద్యార్థులను వారు అభినందించారు. అందరూ గ్రంథాలయ సేవలను ఉపయోగించుకుని బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. బొమ్మిడి కృష్ణమూర్తి, రిసోర్స్ పర్సన్ జీవన్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా పిల్లలందరికీ స్నాక్స్, ఐస్ క్రీమ్స్, కేకులు పంపిణీ చేశారు. పర్సనల్ డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్ స్కిల్స్ గురించి డాక్టర్ చిన్న మల్లిశ్రీనివాసరావు పిల్లలకు బోధించారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డ్ కౌన్సిలర్ తోట అరుణకుమారి, 14వ వార్డు కౌన్సిలర్ కృష్ణవేణి, పి.కిరణ్‌కుమార్, సూర్యంబాబు, సమర్పణరావు, నాగలక్ష్మి, అక్షద, సుధీర్ మోహన్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్‌ఎల్.కుమారి తెలిపారు.


గ్రంథాలయంలో విద్యార్థులు

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

మండలంలోని ఎంపిపిఎస్ నెంబర్-2 కాపవరం పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం విద్యాసామగ్రి అందించారు. పాఠశాల హెచ్ఎం వి.బేబీ సరోజ తల్లిదండ్రుల సహకారంతో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వీటిని అందించారు. పాఠశాలలో ఫస్ట్ క్లాస్‌లో చేరిన విద్యార్థులకు పాలకొల్లు పట్టణ జివిఆర్ఎం మున్సిపల్ పాఠశాల హెచ్.ఎం.రాయపూడి భవానీప్రసాద్ సహకారంతో విద్యా సామగ్రిని అందించారు. పలకలు, కాపీరైటింగ్ బుక్స్, స్లేట్ పెన్సిల్స్, పెన్సిల్స్, ఎరేజర్స్, స్కేల్స్, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని గ్రామస్తులను కోరారు.

'విద్యుత్ కోతలు నామమాత్రమే'

ప్రజాశక్తి - ఉండి

ప్రస్తుత వేసవి సీజన్‌లో విద్యుత్ కోతలు నామమాత్రంగానే ఉన్నాయని, కేవలం లోడ్ రిలీఫ్ మాత్రమే ఇస్తున్నట్లు విద్యుత్ శాఖ భీమవరం డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. ఉండి 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ స్థాయిని మించి విద్యుత్ వినియోగం పెరిగినప్పుడు తాత్కాలికంగా ఒక గంట మాత్రమే విద్యుత్ రిలీఫ్, అది కూడా కొన్ని ప్రాంతాలకు ఒకసారి, మరికొన్ని ప్రాంతాలకు మరొకసారి రొటేషన్ పద్ధతుల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రత్యేకంగా ఆకివీడు ఎడిఇ కె.రాంబాబు స్వయంగా ఉండి 220కెవి సబ్‌స్టేషన్‌లో లోడ్ మానిటరింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత వేసవి సీజన్‌లో ఎక్కడైనా సాంకేతిక లోపాలు ఉండి ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఆగి ఉండొచ్చేమో గాని ఎక్కడా కూడా విద్యుత్ కోత అనేది ప్రకటించలేదని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వేసవిలో విద్యుత్ కోత లేకుండా చేసేందుకు ముందుగానే ప్రణాళిక ప్రకారంగా వేసవికి ముందే అవసరమైన చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడంతో అనేక ప్రాంతాల్లో పెద్దఎత్తున ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేసినట్లు పీర్ అహ్మద్ ఖాన్ వివరించారు. దీనిని విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

9న డిఎన్‌ఆర్‌లో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు డిఎన్‌ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 9న ఎపి ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి తెలిపారు. హీరో మోటార్స్, ముత్తూట్ ఫైనాన్స్, కియా మోటార్స్, అపోలో ఫార్మసీ, ఎల్ఐసి, టెక్ మహీంద్రా మొదలైన ప్రముఖ కంపెనీలతో పాటు మరికొన్ని కంపెనీలు పాల్గొంటున్నాయని, 18 నుంచి 35 వయస్సు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని చెప్పారు. కంపెనీల నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని పాలకొల్లు, పరిసర ప్రాంత నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో కూడా కొన్ని ఉద్యోగ అవకాశాలున్నాయని ఆసక్తి ఉన్నవారు 8985644389 నంబరును సంప్రదించాలని తెలిపారు.

నేడు ఆచంటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలో శనివారం ఉదయం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు శంకుస్థాపనలు చేయనున్నట్లు సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆచంట పంచాయతీ పరిధిలో 9 కమ్యూనిటీ భవనాలకు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆచంట పెద్దపేట మాధవరావు హాస్పటల్ పక్కన మొదలుకొని కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

కెపిపాలెం సౌత్‌లో రీసర్వే

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపిపాలెం సౌత్‌లో శుక్రవారం అధికారులు రీ సర్వే చేశారు. దీనిలో భాగంగా డ్రోన్ సాయంతో గ్రామ హద్దులు, ఇతర వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.అనితకుమారి, మండల సర్వేయర్ ధనరాజు, సర్పంచి కడలి సోంబాబు, ఎంపిటిసి సభ్యులు అందే దొరబాబు పాల్గొన్నారు.

8న నరసాపురంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం పురపాలక సంఘ పరిధిలోని రెండో వార్డు హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోని చేపలను పట్టుకునే హక్కులు పొందేందుకు బహిరంగ వేలం ఈ నెల ఎనిమిదో తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. కార్యాలయంలో కమిషనర్, వారి అనుమతి పొందిన అధికారిచే ఈ వేలం నిర్వహించనున్నారు. సదరు పాటలో పాల్గొను అభ్యర్థులు ధరావత్తుగా రూ.25 వేల నగదు డిపాజిట్ చేయాల్సి ఉంది.

ఉండి తహశీల్దార్ రవీంద్రకుమార్ బదిలీ

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండల తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మల్లెపు రవీంద్రకుమార్ సాధారణ బదిలీల్లో భాగంగా నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఎఒగా బదిలీ అయినట్లు తహశీల్దార్ కార్యాలయ వర్గాలు శుక్రవారం సాయంత్రం తెలిపాయి. ఉండి తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జీవన్‌రాణి భీమవరం కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

7 నుంచి విత్తనాల విక్రయం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థలో వివిధ రకాల విత్తనాలు విక్రయాలకు అందుబాటులో ఉంటాయని సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంటియు 1121 (శ్రీ ధృతి), ఎంటియు 3626 (ప్రభాత్), ఎంటియు 1224 (మార్టేరు సాంబ), ఎంటియు రైస్ 1273, ఎంటియు రైస్ 1293, పిఎల్ఎ 1100, ఎంటియు రైస్ 1271, ఎంటియు 1282 సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పునాది విత్తనం (ఫౌండేషన్ సీడ్), సత్య ప్రమాణ పూర్వక చీటి విత్తనం (తూత్ ఫుల్) వంటి రకాలు కిలో రూ.35లకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎంటియు రైస్ 1271, ఎంటియు 1282, సన్న రకం ఎంటియు 1224 (మార్టేరు సాంబ) వంటి విత్తనాలు కిలో ధర రూ.40 లకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలను ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు విక్రయాలు ఉంటాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.